క్లుప్తంగా

దోమల నియంత్రణకు చర్యలు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని పలు వార్డుల్లో ఫాగింగ్ చేశారు. బుర్రిపాలెంరోడ్డు, నాజరుపేట, ఆర్ఆర్ నగర్, చినరావూరు పార్కు నందులపేట తదితర ప్రాంతాల్లో దీనిని నిర్వహించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



తెనాలిఅర్బన్: హ్యాపీ హాస్పటల్, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పావనీప్రియాంక, డాక్టర్ అరుణ్‌తేజ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల వైరస్‌లు ప్రబలుతున్నందున్న అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి, శెట్టి సురేంద్ర, సాంబయ్య, చంద్ర, నాగ, రాము తదితరులు పాల్గొన్నారు.

నాటకరంగ కళాకారుడు రాజారావుకు సన్మానం




తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం మాతృదేవత చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం ధనమా దైవమా చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు మందపాటి రాజారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు, ఉలసి చంద్రశేఖర్, పసుపులేటి హర్ష, వేజండ్ల కనకాంబరం, మండే కుమార్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వసతులు ఏర్పాటు చేయాలని వినతి



తెనాలిఅర్బన్: కాలువ కట్టలపై నివశించే నిరుపేద గిరిజనులకు కనీస వసతులు కల్పించేలా చూడాలని ట్రైబల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రావూరి అంజలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మను గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనులకు ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఆమె వెంట ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: 22వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతి సందర్భంగా గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మారీసుపేటలోని ఆమె నివాసం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ రిహానా, నదియా, రేపల్లె సుభాని, మాజీ ఎపీపీ వెలినేని రాఘవయ్య, న్యాయవాది కేవీ సుబ్రహ్మణ్యం, రాజశేఖర్‌రెడ్డి, మంగమూరి హరి, కాళహస్తి రఘు, కేసన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ది తెనాలి మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబురావు కోరారు. ది తెనాలి మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడతూ వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానం అమలులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న ధర్నాకు తాము సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కార్యదర్శి వేజండ్ల మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఎస్ఎం.సుభాని, ఉపాధ్యక్షుడు రాంబాబు, కోశాధికారి వీరబ్రహ్మం పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



బోసురోడ్డులోని శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, ఆర్యవైశ్య ప్రముఖులు

తెనాలిఅర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం చేసిన త్యాగాన్ని అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా తెనాలి ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో గురువారం బోసు రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ముదావహమన్నారు. తెలుగు ప్రజలందరూ ఒక ప్రాంతంలో ఉండాలనే ఉద్దేశంతో ఆయన నిరాహారదీక్ష చేశారని గుర్తు చేశారు. ఆయన త్యాగఫలితంగా మనకు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని చెప్పారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్, తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలే పాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు దేసు శ్రీనివాసరావు, ఉప్పల వరదరాజులు, గొడవర్తి సాయిహరేరామ్, పొన్నూరు శ్యామలరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు చుండూరు శివప్రసాద్, కొల్లా గురునాధగుప్తా, చుండూరు సాయి, కొండవీటి లక్ష్మీపద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మారీసుపేటలోని నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, ఆర్యవైశ్యులు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అంజలిఘటిస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

- పొట్టి శ్రీరాములు జయంతిని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మారీసుపేటలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ముఖ్యఅతిథిగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు పాల్గొన్నారు.
- పొట్టి శ్రీరాములు జయంతిని ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కళాశాలలో గురువారం నిర్వహించారు.
- పొట్టిశ్రీరాములు జయంతిని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములుకు చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కమిషనర్ ఎం.జశ్వంతరావు నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో..

తెనాలిటౌన్: కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీ నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు

ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు



కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తూ..

కొల్లిపర(తెనాలిటౌన్): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని కొల్లిపరలో గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసులు, తహసీల్దార్ జి.నాంచారయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సంజీవరెడ్డి, వడ్లమూడి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి మహిళా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ పథకానికి మునగాల నాగలక్ష్మి రూ.2500 అందజేశారు.

మద్యం తాగి యువకుల హల్‌చల్

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్ ప్లాజా వద్ద మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో రూరల్ పోలీసులు టోల్ ప్లాజా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. మంగళగిరి నుంచి గుంటూరు వైపు మూడు ద్విచక్రవాహనాలపై ఏడుగురు యువకులు వెళుతున్నారు. ఒన్‌వేలో వేగంగా వెళ్తుండగా గమనించిన పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించారు. రెండు వాహనాలు తప్పించుకోగా ఒక వాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. యువకులు మద్యం తాగి ఉండడంతో వారిని స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. ఒక యువకుడు మీరెవరు మీరు పోలీసులేనా నకిలీ పోలీసులా అంటూ వారితో వాగ్వివాదానికి దిగి వారిపైకి దూసుకెళ్లాడు. పోలీసులు, యువకుల మధ్య వాదులాట పెరగడంతో ఎస్ఐ కలుగజేసుకుని స్టేషన్‌కు తరలించారు. యువకులను ఎస్ఐ దుర్భాషలాడి చేయి చేసుకున్నారని సోషల్ మీడియాలో గురువారం ఉదయం వైరల్ కావడం విశేషం. దీంతో ఉన్నతాధికారులు విచారించారు. తాము విదేశాలకు వెళ్లాలని కేసు నమోదైతే తమ భవిష్యత్ నాశనం అవుతుందని మధ్యవర్తులతో రాజీ చేయించడంతో యువకులను విడిచిపెట్టడం గమనార్హం.

ముస్లిం బాలబాలికలకు ఖురాన్‌పై శిక్షణ

మంగళగిరి: రంజాన్ మాసం ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా పెదవడ్లపూడి ముస్లిం ఐక్య వేదిక కార్యాలయంలో గురువారం ముస్లిం బాలలకు ఖురాన్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. నెలపాటు 30 మంది బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు మత గురువు ఎండీ మాకరిన్ బాల తెలిపారు.

ఇంటింట్లో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- నాల్గవ వార్డులో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నాల్గవ వార్డు బీసీ కాలనీ నుంచి గురువారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాల్గవ వార్డు ఇన్‌చార్జి షేక్ నాగూర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అడుసుమల్లి శ్రీనివాసరావు సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ బీసీ కాలనీలో చేతి వృత్తుల వారు ఎక్కువగా నివాసిస్తుంటారని చెప్పారు. వారు సంపాదించే నగదుకు ప్రభుత్వ సంక్షేమం తోడవడంతో వారి జీవన ప్రమాణం పెరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే అజెండాగా బడ్జెట్‌ను రూపొందించిదని చెప్పారు. నాల్గవ వార్డులో పింఛన్లు 461 మందికి, ఇళ్ల స్థలాలు 503 మందికి, అమ్మఒడి సుమారు 400 మందికి, రైతు భరోసా సుమారు 400 మందికి ఇచ్చినట్లు చెప్పారు. మూడేళ్లలో వార్డులో రూ.30 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు నాలాది ప్రభాకర్, మాజీ వైస్ చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్‌బేగ్, షేక్ ఇస్మాయేల్, కొమరబత్తిన జయపాల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ తులసీ భగవాన్, నాల్గవ వార్డు నాయకులు దేసు శ్రీనివాసరావు, రెడ్డి రమణమ్మ, రిమ్మనపూడి నరసింహారావు, దేవరపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ సుభాని, షేక్ జిలాని, పి.కోటేశ్వరరావు, షేక్ పందు, నాని, ఇందిరా ప్రియదర్శిని, రెడ్డి రమణమ్మ, చిరంజీవి, రాఘవ, బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, కాకి దేవసహాయం, కాళిదాసు వెంకటసత్యం, అక్కిదాసు కిరణ్‌కుమార్, బూరెల దుర్గా, కుర్రా శ్రీను, మీరావలి, షేక్ గఫూర్, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, చుండూరు సాయి, భాస్కర్, కాళహస్తి భవాని, కేసర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొల్లిపర మండలం జెముడుబాడులో ఈ నెల 14వ తేదీ పిల్లల మధ్య చెలరేగిన వివాదం పెద్దల వరకు చేరి పరస్పర దాడులకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో కురగంటి కోటేశ్వరరావు కత్తితో చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన మత్తే రవి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడు కోటేశ్వరరావును రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి



తెనాలిరూరల్: మద్యం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు వైద్యశాలకు పంపి చికిత్స అందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో చెంచుపేటలోని ఓ బార్‌లో గుర్తుతెలియని వ్యక్తి గురువారం సాయంత్రం మద్యం తాగాడు. బయటకు వచ్చిన అతను రోడ్డుపై అచేతనంగా పడి ఉండటంతో స్థానికులు గమనించి 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. త్రీటౌన్ పోలీసులు ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఘనంగా శిలువ ధ్యానం

పెదపరిమి(తాడికొండ): క్రైస్తవుల 40 రోజుల తపస్సు కాలాన్ని పురస్కరించుకొని తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించిన క్రీస్తు శిలువ ధ్యానం, పాదయాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్రీస్తు శిలువ శ్రమలను ధ్యానిస్తూ అనంతవరం, నెక్కల్లు, తుళ్లూరు, పెదపరిమి, బడేపురం గ్రామాలకు చెందిన క్రైస్తవ సంఘాలు పాదయాత్రలో పాల్గొన్నారు. మానవాళి రక్షణ కోసం తలకు ముళ్ల కిరీటంతో శిలువను మోస్తూ కొరడా దెబ్బలు తింటూ శిలువను మోసి క్రూరంగా హింసించబడి సమాధి చేయబడిన క్రీస్తు శిలువ మార్గం సన్నివేశాన్ని ఆకట్టుకునేలా విశ్వాసులు పాదయాత్రలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల నుంచి పాదయాత్రగా వచ్చిన విశ్వాసులు పెదపరిమిలోని సంతాన మాత పుణ్యక్షేత్రానికి చేరుకొని చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయంలో యడ్లపాడుకు చెందిన ఫాదర్ పాస్టర్ బోస్ క్రీస్తు వాక్య పరిచర్య చేయగా సంతానమాత పుణ్యక్షేత్రం ఫాదర్ మాదినేని జ్ఞాన ప్రకాష్, అనంతవరం ఫాదర్ అనీల్, తుళ్లూరు ఫాదరి దాసరి తంబి, నిడుముక్కల ఫాదర్ సుధీర్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

గృహ వినియోగ ఖర్చులపై శాంపిల్ సర్వే



గృహ యజమాని చెబుతున్న వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

తెనాలిటౌన్: ప్రజల ఆర్థిక స్థితిగతులపై జాతీయ గణాంక కార్యాలయం అధికారులు (గుంటూరు) గురువారం పట్టణంలో గృహ వినియోగ ఖర్చులపై శాంపిల్ సర్వే నిర్వహించారు. గుంటూరు ప్రాంతీయ కార్యాలయం పర్యవేక్షణ అధికారి డి.హనుమంతరావు ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగ ఖర్చులపై సర్వే చేపట్టారు. పట్టణంలోని మారీసుపేట 24వ వార్డులో గృహ యజమాని పి.వెంకటేశ్వరరావు చెప్పిన వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సర్వే ఎన్యూమరేటర్ కుర్రం శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వే వివరాలను నేరుగా ప్రజల నుంచి సేకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు రావడానికి దోహదపడతాయన్నారు. విద్య, వైద్య, ఉపాధి, ఆర్థిక రంగాలు మెరుగుపరచడానికి సర్వే ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, ప్రజలు సహకరించాలని కోరారు. సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.జగదీష్ పర్యవేక్షించారు.

పొలంబడి రైతులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డీడీఏ రామాంజనేయులు

కొల్లిపర(తెనాలిటౌన్): కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఆర్‌సీ డీడీఏ పి.రామాంజనేయులు మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన పంట పండించడం, రైతులు వారి పొలంలో పర్యావరణ విశ్లేషణ చేసి పంట పరిస్థితినిబట్టి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ పరిజ్ఞానంపై రైతులను నిష్ణాతులను చేయడం, మట్టి నీటిని నిల్వపెట్టుకొనే సామర్థ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న, పొలంబడి ప్లాట్‌ను పరిశీలించారు. మొక్కజొన్నకు పచ్చపురుగు, లద్దె పురుగు, కత్తెర పురుగు ఆశించి ఉన్నాయని, వీటి నివారణకు ఇమమెక్టిన్ బెంజోయేట్ అనే మందును లీటరు నీటికి ఒక గ్రాము వంతున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ ప్రవీణ్, ఏడీఏ (తెనాలి) కె.వెంకటరావు, ఆర్బీకే సహాయకులు గోపిరెడ్డి, మహాలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది, మున్నంగి, దంతలూరు గ్రామ పొలంబడి రైతులు పాల్గొన్నారు.

అనుమతిలేని లేఅవుట్లపై సీఆర్డీఏ అధికారుల కొరడా

- నాలుగు లే అవుట్లలో రోడ్లు తొలగింపు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



అనధికారి లే అవుట్‌లో బోర్డులు ఏర్పాటు చేసిన సీఆర్డీయే పంచాయతీ అధికారులు

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో అనుమతి లేని లే అవుట్లపై సీఆర్డీయే అధికారులు కొరడా ఝుళిపించారు. సర్వే నెంబర్ 308, 310, 99, 310/4 లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్న నాలుగు లే అవుట్లలో రోడ్లు, హద్దు రాళ్లు, తొలగించి అనధికారి లే అవుట్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అనధికారిక లే అవుట్లు అభివృద్ధి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తొలగించేందుకు అయిన ఖర్చులు కూడా ప్లాట్ల యజమానుల నుంచే వసూలు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. లే అవుట్లు వేసే యజమానులు సీఆర్డీయే, పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని లేకుంటే ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు, ప్లాను మంజూరు, లోన్లు మంజూరు చేయబడవు కావున కొనుగోలుదారులు గమనించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్డీయే డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ స్టాలిన్, పంచాయతీ కార్యదర్శి వి రవి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పశువిజ్ఞాన బడులు తప్పనిసరి

ఫిరంగిపురం: నెలలో ఒకసారి ఆర్బీకే కేంద్రాల్లో పశువిజ్ఞాన బడులు తప్పనిసరిగా నిర్వహించి పాడి రైతులకు పశువుల పెంపకంపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని నుదురుపాడు పశువైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల రిజిస్టర్‌లు పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి ఇప్పటివరకు పశు వైద్యశాలలో అందించిన సేవల వివరాలు పశువైద్యుడు నూర్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బేతపూడి, వేమవరం, యర్రగుంట్లపాడు గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఆయా గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాల్లో తప్పనిసరిగా పాడి రైతులకు పశువుల పెంపకం, దాణ, అనారోగ్య సమస్యలు గుర్తించడం, టీకాల వివరాలపై సిబ్బంది అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతినెలా వాటిని పశువైద్యాధికారి పర్యవేక్షిస్తూ ఆయా సమయాల్లో వచ్చిన కేసులను చూడాలన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి పీర్ అహ్మద్ ఉన్నారు.

పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ఫిరంగిపురం: రానున్న వర్షాల ప్రభావంతో పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వ్యవసాయశాఖ ఏఓ రమణకుమార్ రైతులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొలాల్లోని కల్లాల్లో ఉన్న మిర్చిపంటపై పరదాలు వేసుకోవడం కాని లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించడంకాని చేయాలని సూచించారు. శనగలు కోసి మండెలు వేసి ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేనిచో పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు దీనిని గమనించి తగిన జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలన్నారు.

మందపాడు పీహెచ్‌సీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న మందపాడు సర్పంచ్ సంజీవరెడ్డి

మేడికొండూరు: మండలంలోని మందపాడు గ్రామ ప్రాథమిక ఆరోగ్యవైద్యకేంద్రానికి ఎన్క్వాస్ అవార్డు దక్కింది. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో జాతీయ వైద్య ఆరోగ్యబృందం మందపాడు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించింది. మౌలిక సదుపాయాలను, ఆసుపత్రి పనితీరు పరిశీలించిన బృందం నివేదికను జాతీయ ఆరోగ్య వైద్య ఆరోగ్యకేంద్రం శాఖకు అందించింది. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో మందపాడు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ఎన్నిక కావడంతో, ప్రతి సంవత్సరం ఆసుపత్రి అభివృద్ధికి రూ.3లక్షలు ప్రతి ఏటా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా తరుపున రావడ జరుగుతుందని మందపాడు గ్రామ సర్పంచ్ ఆవుల సంజీవరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు చేతుల మీదుగా అవార్డును సర్పంచ్ సంజీవరెడ్డి అందుకున్నారు. అవార్డు రావడంపై మందపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తపరిచారు.

ఉర్దూ మాధ్యమంలోనే బోధించాలి

ఫిరంగిపురం: ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు తప్పనిసరిగా ఉర్దూ మాధ్యమంలోనే బోధించాలని ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం అన్నారు. మండలంలోని పొనుగుపాడు ప్రాథమిక ఉర్దూ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న పీఎస్సీ సురేష్, సతీమణి కమల తదితరులు

తాడికొండ: తుళ్లూరు మండలం హైకోర్టు సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటియూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ పిఎస్సీ సురేష్, సతీమణి కమల, అడ్వకేట్ వరలక్ష్మీలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిలో దాహార్తి తీర్చేందుకు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ జెట్టి నరేష్, వైస్ ప్రెసిడెంట్ పైర్ల నాగమల్లేశ్వరరావు, పలువురు లాయర్లు పాల్గొన్నారు.